క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

నారాయణపేట: జిల్లాలోని వివిధ మండలాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ నందకిశోర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 132 కేవీ మరికల్ ఉప విద్యుత్ కేంద్రంలో మరమ్మతులతో మరికల్, అప్పంపల్లి, వెంకటాపురం, అప్పక్‌పల్లి, కొండాపూర్, ధన్వాడ, కొటకొండ, కొల్లంపల్లి, చిన్నజట్రం, సింగారం, పేరపళ్ల, గోటూర్, ఎక్లాస్‌పూర్, ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలో ఉన్న వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వ్యవసాయ రంగానికి చెందిన రైతులు, గృహ వినియోగదారులు, పరిశ్రమల రంగానికి చెందిన యజమానులు ఈ అంతరాయనికి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థికి ప్రశంస

ఊట్కూరు: జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఉపన్యాస పోటీలలో శుక్రవారం చిన్నపొర్ల పాఠశాలకు చెందిన అర్చన ప్రథమ స్థానం సాధించింది. విద్యార్థికి జిల్లా విద్యాశాఖ సిబ్బంది రూ.3 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, పద్మనలిని, శ్రీనివాస్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జావెలిన్ త్రో కిట్ బహూకరణ



నారాయణపేట రూరల్: అథ్లెటిక్ అసోసియేషన్, వాలీబాల్ అసోసియేషన్ సంయుక్తంగా జావెలిన్ క్రీడాకారుడు రవికుమార్‌కు ప్రాక్టీస్ నిమిత్తం కిట్‌ను శుక్రవారం స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో అందజేశారు. కార్యక్రమంలో కోచ్ హారికదేవి, మహేష్, రమణ పాల్గొన్నారు.

ఓటర్లను మభ్యపెడితే కఠిన చర్యలు

కోయిల్‌కొండ: ఓటర్లను మభ్యపెట్టి తాయిలాలు ఇచ్చి, ఓటు వేయించుకునేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ సురేష్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వింజామూర్, ఎల్లారెడ్డిపల్లి, శేరివెంకటాపూర్, లింగల్‌చేడ్, సూరారం, బూర్గుపల్లి, తీర్మలంపల్లి, కనాయపల్లి, రాంపూర్, దమాయపల్లి, కేశ్వాపూర్, గ్రామాల్లో టిబెటన్ బోర్డర్ పోలీస్, కోయిల్‌కొండ పోలీసులతో కలిసి రూట్‌మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మండల సభ వాయిదా

ఆత్మకూర్: మండల సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభించిన ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ఎవ్వరు హాజరు కాలేదన్నారు. ఎన్నికల అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ముమ్మరంగా ప్రచారం

రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక

కోస్గి: పట్టణానికి చెందిన కోస్గి పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డితోపాటు కుమ్మరి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుమ్మరి బిచ్చప్ప, బీజేపీ నాయకుడు రాంబాబుతోపాటు పలువురు శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు నియోజకవర్గంలో శుక్రవారం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా దుద్యాల మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో వారికి కండువా వేసి పార్టీలో చేర్చుకున్నారు.

మంత్రి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరికలు

కోస్గి: మున్సిపల్ పరిధిలోని 9వ, 4వ వార్డు సంపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ యువకులు సుమారు 100 మంది మంత్రి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు శుక్రవారం సంపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు.

మద్దూరులో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

మద్దూరు: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సోదరి నర్మదమ్మ, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ వెంకటయ్య, మాజీ ఎంపీపీలు సంగీత, నాగమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మద్దూరులోని మీదిగేరి, కావుగేరి తదితర ప్రాంతాల్లో కేసీఆర్ పథకాలు, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు.

ధన్వాడ ఆడబిడ్డను ఆదరించండి

నారాయణపేట/ధన్వాడ/మరికల్: ధన్వాడ ఆడబిడ్డను ప్రజలందరూ ఆదరించి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం ధన్వాడలో దివంగత చిట్టెం నర్సిరెడ్డి, చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి ఘాట్‌లకు పూలమాలాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గ్రామంలో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మరికల్ మండలంలోని అప్పంపల్లిలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలపై తొలి సంతాకం చేయడం చేస్తారని తెలిపారు.

కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మొద్దు



మరికల్‌లో మత్స్యకారులను ఓట్లు అడుగుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మరికల్: అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం, పెద్దచింతకుంట, ఎలిగండ్లలో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ అమలు చేసిన పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. ప్రతిపక్షల మాటలు నమ్మి వారికి ఓటు వేస్తే మరో 50 ఏళ్లు రాష్ట్రం వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. మరోసారి ఓట్లతో దీవిస్తే సేవ చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ, తిరుపతయ్య, కృష్ణారెడ్డి, బసంత్, రామస్వామి, రవి, గోపాల్, సుజాత పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే సంక్షేమ పథకాలు

కోయిల్‌కొండ: సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమ పథకాలు అందుతాయని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కుమ్మరిరాజు, లక్ష్మీనారాయణ, పానుగంటినాగేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్దలో ప్రచారం నిర్వహిస్తున్న స్వాతిరెడ్డి

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి

దామరగిద్ద: కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అభ్యర్థి రాజేందర్‌రెడ్డి సతీమణి స్వాతి రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రైతులకు 24 గంటల విద్యుత్, రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లావణ్య, జ్యోతి, సర్పంచ్ ఆశమ్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, సువర్ణమ్మ, ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, విండో అధ్యక్షుడు ఈదప్ప, భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు



మక్తల్‌లో జలంధర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కృష్ణా: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, బీసీ అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలంపల్లి, కున్సి, చేగుంట, కృష్ణా, తంగిడి, హిందుపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు జలంధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కృష్ణాలో మహిళలు పూర్ణ కుంభం, హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొండయ్య, సోమశేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మజ్జిగ సురేష్, ఎంపీటీసీ వెంకటేష్, నల్లె నర్సప్ప,రాఘవేంద్ర ఉన్నారు.

మక్తల్: అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్‌లో ప్రజల ఆశీర్వాదంతో బీజేపీ జెండా ఎగరవేస్తామని మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామాల్లో జలంధర్‌రెడ్డి, పట్టణంలోని వార్డుల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య ప్రచానం చేశారు. వీరితో పాటు పద్మజారెడ్డి మక్తల్ పట్టణంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావని, మున్సిపల్ వైస్ చైర్మన్ అఖిలారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, ఈసరి నాగప్ప, కౌన్సిలర్లు కౌసల్య, అర్చన, ఎంపీటీసీ బాల్‌రాం రెడ్డి, రంగప్ప, తిమ్మప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, నాగప్ప, కుర్వలింగం, ద్యావరింటి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ప్రచారం

అమరచింత: కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమంటూ పట్టణంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో డిజిటల్ ప్రచారం నిర్వహించారు. మక్తల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జలేంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

కోస్గి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలు, సెక్టార్ ఆఫీసర్స్, వార్డు ఆఫీసర్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి ఓటరుకు సమాచారం అందించాలని, సీ విజిల్ పత్రాలు అందజేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ విధానంపై అవగాహన కలిగించే నిమిత్తం ప్రతి ఇంటికి ఓటర్ గైడ్స్ పత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. కొత్తగా ముద్రించిన ఓటరు గుర్తింపు కార్డులను బీఎల్‌ఓలు స్వయంగా ఓటర్లకు అందించాలన్నారు.

నేటి నుంచి మహాలింగేశ్వర స్వామి జాతర



నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో వెలిసిన మహాలింగేశ్వర స్వామి జాతర శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటిరోజు ఉదయం 9గంటలకు పల్లకీసేవ, సాయంత్రం 5:30గంటలకు జ్యోతి, రాత్రి భజన, రెట్లపట్లు ఉంటాయి. ఆదివారం స్వామి వారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు, సర్వదర్శనం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, ఉత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే ఇంటింటా సౌభాగ్యం



చంద్రగడ్‌లో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

ఊట్కూర్: ఇందిరమ్మ రాజ్యంతోనే ఇంటింటా సౌభాగ్యం వస్తుందని మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని పులిమామిడి, బిజ్వార్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పులిమామిడిలో బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. బిజ్వార్‌లో సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ నాయకులతో కలిసి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడిద్దాం అనే కరపత్రాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్‌కి అధికారం ఇచ్చిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరయ్యగౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, లక్ష్మారెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కున్సి, ముడుమాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కున్సికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూగప్ప వాకిటి శ్రీహరికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

అమరచింత: కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని ఆగం చేసింది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే అని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని చంద్రగడ్, కిష్టంపల్లి, ఈర్లదిన్నె, మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లెలో పర్యటించి కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యమని వేడుకున్నారు.

ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

రాష్ట్రంలో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డువచ్చినా ఆపలేరని టీపీసీసీ గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం. గరాజ్ గౌడ్ అన్నారు. మండలంలోని మస్తిపురంలో శుక్రవారం వివిధ పార్టీల నుంచి వచ్చిన పలువురిని కాంగ్రెస్ పార్టీలోకి కండువాలు కప్పి ఆహ్వానించారు.

మక్తల్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మాగనూర్, కృష్ణ, మక్తల్, నర్వలో ప్రచారం నిర్వహించారు.

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలి



మాగనూర్: మండలంలోని ఓబ్లాపూర్ గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. దశాబ్దాల కాలంగా ఉన్న మట్టి రోడ్లను బీటీలుగా మార్చకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కనీసం ఆటోలు కూడా రావడం లేదని, వారానికి ఒకటి మాత్రమే వస్తుందని వాపోతున్నారు. దీంతో ఏదైనా అత్యవసర సమయం ఏర్పడితే ఇంక అంతేసంగతి అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

నిర్భయంగా ఓటు వినియోగించుకోండి



ముడుమాల్ వీధుల్లో పర్యటిస్తున్న రిజర్వ్ పోలీసులు

కృష్ణా: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన ముడుమాల్, గుడెబల్లూర్‌లో శుక్రవారం రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో పురవీధుల్లో పర్యటించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు తాము గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు సృష్టించకూడదని, ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా ఉండాలని కోరారు.

పుస్తకంతోనే వికాసం

జడ్చర్ల టౌన్: పుస్తకంతోనే వికాసం పెంపొందుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ అన్నారు. శుక్రవారం జడ్చర్ల కేంద్రంలో ప్రారంభించిన గ్రంథాల వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె పాఠకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించిన ఆమె గ్రంథాలయంలో ఉన్నటువంటి అరుదైన పుస్తకాలతో ఎంతో విజ్ఞానం చేకూరుతుందని అన్నారు. ఇలాంటి పుస్తకాలను పాఠకులు ఆసక్తితో చదవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ మేధావులు పుస్తక పఠనంతోనే ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కవిత, నీరజ, విజయ్ కుమార్, రజని, నాగరాజు, నర్సింహ, రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



న్యాయసదస్సులో మాట్లాడుతున్న పీపీ సురేష్

ఊట్కూరు: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దజట్రం, అవుసలోనిపల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, గుట్కా, తంబాకులాంటివి నిషేదిత పదార్థాలు వాడకూడదని తెలిపారు. ఈ పదార్థాలు వాడటం వల్ల క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఎవరైన రహస్యంగా అమ్మకాలు చేస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మికులు, మూఢనమ్మకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హనుమంతు, కత్తలప్ప, కృష్ణారెడ్డి, దత్తాత్రేయ, ఆజమ్మ, నారాయణ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి

కోస్గి: జిల్లాలో ప్రధాన రహదారుల పక్కనే ఉండే పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని సూచించారు. శుక్రవారం సాయంత్రం గుండుమాల్, కోస్గి మండలాల్లో పాఠశాలల క్లస్టర్ సమావేశాలను తనిఖీ చేశారు. గుండుమాల్ మండల కేంద్రంలో నారాయణపేట–కోస్గి ప్రధాన జిల్లా రహదారి పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులు ప్రధాన రోడ్డు దాటుతుండటాన్ని గుర్తించిన డీఈఓ అప్పటికప్పుడు ఉపాధ్యాయులను పిలిచి మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం క్లస్టర్ మీటింగ్ వెళ్లినట్లు గుర్తించి, ప్రతిరోజు పాఠశాల వదిలిన సమయంలో రోడ్డు పక్కన ఉండే పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థులను సురక్షితంగా రోడ్డు దాటించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విధిగా విద్యార్థులను రోడ్డు దాటించిన తర్వాతనే హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాఠశాల నుంచి వెళ్లాలన్నారు. సాయంత్రం వేళ వాహనాల రాకపోకలతో విద్యార్థులకు ప్రమాదం అయ్యే అవకాశం ఉందని, ఈ విషయంలో రోడ్డు పక్క ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం కోస్గి మండలంలోని ముశ్రీఫా క్లస్టర్‌లో మీటింగ్‌ను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు తరగతి వారి విద్యార్థుల సామర్థ్యాలపై శ్రద్ధ వహించడంతోపాటు చతుర్విద ప్రక్రియల వంటి అంశాలు విద్యార్థులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.



గుండుమాల్‌లో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ

ఓటర్ స్లిప్పుల అందజేత

ఊట్కూరు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు శుక్రవారం బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. మండలంలో 51 పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓలు జాబితా ఆధారంగా అందిస్తున్నారు. ఎన్నికల సిబ్బంది నాలుగు సెక్టార్‌లుగా విభజించి స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, పార్వతమ్మ, పుష్పమ్మ, రమాదేవి, వెంకటేశ్వరమ్మ, జయదేవి తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓ

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న రమణారెడ్డి

మాగనూర్: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీపీడీఓ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీడీఓ మాట్లాడుతూ.. సబ్జెక్టు వారీగా ఉన్నతి ప్రోగ్రాం తప్పనిసరిగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లక్ష అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులుగా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల ఊరేగింపునకు పటిష్ట బందోబస్తు

ఆత్మకూర్: కురుమూర్తిస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే అలంకారోత్సవానికి సంబంధించిన ఆభరణాల ఊరేగింపునకు వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డితో పాటు ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 15 మంది ఏఎస్ఐలు, వంద మంది పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ కేఎస్ రత్నం తెలిపారు. శుక్రవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ లాకర్‌లో రూ.కోట్లు విలువజేసే స్వామివారి ఆభరణాలు భద్రపర్చారు. శనివారం ఉదయం 10.30 గంటలకు బయటకు తీసి ప్రత్యేక పూజల అనంతరం పరమేశ్వరస్వామి చెరువుకట్ట వరకు ఊరేగింపు కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు, భక్తులు ఊరేగింపు ప్రశాంతంగా కొనసాగేందుకు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ నరేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ కేఎస్ రత్నం

ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు తనిఖీ

మదనాపురం: మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు సంజయ్ కుమార్ మిశ్రా తనిఖీ చేశారు. అంతకుముందు మండలంలోని దంతనూరు సమీపంలో ఉన్న ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కూలీలతో మాట్లాడారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ అబ్రహం లింకన్ తదితరులు ఉన్నారు.



ఎన్‌సీసీ కంపెనీ సందర్శన



జడ్చర్ల టౌన్: బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ 37 కంపెనీని తెలంగాణ 8వ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్‌కే సింగ్ శుక్రవారం సందర్శించారు. కేడేట్స్‌ను నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రికార్డులను, కార్యకలాపాల డైరీని పరిశీలించారు. విద్యార్థులకు ఇష్టపడి కష్టపడాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియ చిన్నమ్మ, సదాశివయ్య, ఎన్‌సీసీ విద్యార్థులు ఉన్నారు.

భూసారం బుగ్గి చేయొద్దు



మాగనూర్ సమీపంలో వరి కోయిలకు నిప్పంటించిన రైతులు

మాగనూర్: వరి పొలంలో గడ్డికి నిప్పంటిస్తే ఆ భూమిలో ఒక సెంటీమీటర్ లోతు వరకు భూమి పైపొరలో మట్టి 33.8 నుంచి 42.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతకు గురవుతుంది. అత్యంత కీలకమైన సూక్ష్మ జీవరాశులు, శిలీంద్రాల సంతతి నశించిపోతుందని, భూమి సేంద్రియ లక్షణం నాశనమవుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. భూమి పైపొరలోని మేలు చేసే మిత్ర పురుగులు నశించడంతో పంటలపై పురుగులు దాడి పెరిగిపోతుంది. టన్నుల పంట వ్యర్థం తగులబెట్టినప్పుడు మట్టిలోని సేంద్రియ కర్బనంతో పాటు (5.5 కిలోల నత్రజని, 2.3 కిలోలకు పైగా ఫాస్పరస్, 25 కిలోల పొటాషియం, కిలోకు పైగా గంధకం వంటి) 33.8 పోషకాలు నాశనమవుతాయి. భూసారం ఎవరూ కూడా బుగ్గి చేయొద్దని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.